

ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

ప్రజాశక్తి-పాడేరు: వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన తాత్కాలికంగా వాయిదా పడిందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జూలై ఒకటో తేదీన పాడేరు మండలం లగిశపల్లి, ఉగ్గం గొయ్యి గ్రామాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొనడంతో ముఖ్యమంత్రి పర్యటనను వాయిదా వేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ మార్పును ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

స్పెషల్ డిఎస్‌సిపై సిఎం ప్రకటన చేయాలి

కలెక్టర్‌కు స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ వినతి



కలెక్టర్ కు వినతిపత్రం అందిస్తున్న స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో పాడేరు వస్తున్న సందర్భంగా గిరిజన స్పెషల్ డిఎస్‌సిపై స్పష్టమైన ప్రకటన చేయాలని గిరిజన స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ను కలిసి కలక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఆదివాసీలకు 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టబద్ధత చేస్తామన్న హామీని నెరవేర్చాలని పేర్కొన్నారు. 5వ షెడ్యూల్డ్ ఏరియా (విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి) కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో పరిమిత పోస్టులు కేటాయించడంతో గిరిజన యువత, ఉపాధ్యాయుల్లో అశాంతిని కలిగిస్తోందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఉద్యోగ నియామకాల్లో 100శాతం రిజర్వేషన్ పై దృష్టి పెట్టాలని కోరారు. ఐదవ షెడ్యూల్లోని పేరా 5(1) గిరిజన ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ షెడ్యూల్డ్ ప్రాంతాలలో చట్టాల అమలును నిర్దేశించడానికి గవర్నర్ కు పూర్తి విచక్షణాధికారం కల్పిస్తుందని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల ఉద్యోగాల్లో ఆదివాసీలకు 100శాతం రిజర్వేషన్ పై నిర్లక్ష్యం చెస్తే నిరుద్యోగ యువత సంఘ వ్యతిరేక శక్తుల వైపు, తీవ్రవాద భావజాలాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందని వివరించారు, సామాజిక నిర్మాణం, గిరిజన ప్రాంత అభివృద్ధికి హానికరం వంటి తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చునని పేర్కొన్నారు. మే 8, 2025న ఏజెన్సీ డిఎస్‌సి సాధన కమిటీని గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ అధికారులతో చర్చించడానికి ఆహ్వానించించారని, చర్చల్లో భాగంగా 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్‌లకు ఎటువంటి చట్ట పరమైన ఇబ్బందులు లేవని అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి తెలిపారని వివరించారు. అయినప్పటికీ 2025 మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు 100శాతం ఉపాధ్యాయ పోస్టులు కేటాయించే ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సలహా మండలిని నియమిస్తూ 21, మే 2025న ఉత్తర్వులు జారీ చేసిందని, టిఏసి సమావేశం ఏర్పాటు చేసి 2025 మెగా డిఎస్‌సి నుండి 5వ షెడ్యూల్డ్ ఏరియా పోస్టులను మినహాయిస్తూ తీర్మానం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ స్పెషల్ డిఎస్ సి సాధన కమిటీ చైర్మన్ కె.కాంతారావు, సలహాదారులు పి.అప్పలనరస, కన్వినర్లు కూడా రాధాకృష్ణ, నాగేశ్వరావు, భాను, సిహెచ్ రావు, కార్తీక్, దాస్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లోనే రేషన్ పంపిణీకి చర్యలు

సివిల్ సప్లై అధికారుల హామీ ▸ ప్రజాశక్తి కథనానికి స్పందన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతగిరి: 'గిరిజనానికి రేషన్ దూరం' పేరుతో ఈనెల 13వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, ఇన్ఫర్మేషన్ ఎడి అలదీప్ యాదవ్ స్పందించారు. ఈ మేరకు అల్లూరు జిల్లా సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ ప్రశాంత్‌లు ఎన్ఆర్‌పురం పంచాయతీ పరిధి బూరిగ, చిన్న కోనల గ్రామాలలో సందర్శించారు గిరిజనులు రేషన్ సమస్యలపై పడుతున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, తమ గ్రామం నుండి రొంపిల్లి పంచాయతీ కేంద్రంకి వెళ్లాలంటే రాను పోను 16 కిలోమీటర్లు ఎత్తయిన కొండ పనులు దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా నడిచి వెళ్ళవలసి వస్తుందన్నారు.తమ గ్రామంలోనే బియ్యం ఇస్తే తమకు అందరికి ఇబ్బంది ఉండదని అధికారులను వేడుకున్నారు. దీనికి స్పందించిన అధికారి యంత్రాంగం. గ్రామంలోనే ప్రతినెల స్టాక్ తెచ్చి అందరికీ ఇస్తామని తెలిపారు. దీంతో గిరిజనులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో పలువురు గిరిజనులు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, గ్రామ వార్డు మెంబర్ ఎస్ అప్పలరాజు, గ్రామస్తులు కోనపర్తి సింహాచలం పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, కార్మికులు

9న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి

- సిఐటియు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలో జిసిసి, హమాలీ కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథులుగా రంపచోడవరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిసిసి హమాలి కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులందరికీ ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేట్‌కరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూడడం ఇటువంటి నిర్ణయాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో కార్మికులు మొత్తం పాల్గొనాలన్నారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, జిసిసి హమాలీ కార్మికులు స్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని మహిళా సర్పంచ్‌లకు జూలై 3 నుంచి 5 వరకూ మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపిడిఒ ప్రసాదరావు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎంపిడిఒ కార్యాలయంలో 'మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం' పేరుతో సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తామన్నారు. పంచాయతీరాజ్ చట్టాలు, పరిపాలన, హక్కులు, బాధ్యతలపై పంచాయతీ మహిళా సర్పంచ్లకు శిక్షణ ఇస్తామన్నారు. మొత్తం 19 మంది మహిళా సర్పంచ్‌లు ఉన్నారని, వారందరూ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణపై 50 శాతం రాయితీ

ప్రజాశక్తి - కొయ్యూరు : ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై 50 శాతం రాయితీ ప్రకటించింది. జూన్ 30 వరకూ ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని, విద్యుత్‌శాఖ ఎఇ నాగేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. చాలామంది 2-3 కిలోవాట్ల అనుమతి తీసుకుంటారు. లెక్కప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. అయితే, అదనపు గృహోపకరణాల వినియోగం వల్ల లోడ్ పెరిగితే, తనిఖీల్లో గుర్తిస్తే జరిమానా విధిస్తారు. సమస్యను తొలగించేందుకు, ప్రస్తుత వినియోగాన్ని లెక్కించి, అదనపు కిలోవాట్లపై 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

కృష్ణమూర్తి కుటుంబానికి ఎంవివి పరామర్శ



పరామర్శిస్తున్న ఎంవివి ప్రసాద్

ప్రజాశక్తి - కొయ్యూరు : రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు పాంగి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ జిసిసి చైర్మన్ ఎంవివి ప్రసాద్ శనివారం పరామర్శించారు. కృష్ణమూర్తి భార్య నాగమణి, పెద్దకుమార్తె ప్రణీత, రమాదేవి, నరేంద్రను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో నర్సీపట్నం జెడ్‌పిటిసి సకల రమణమ్మ, బిజెపి నాయకులు అరిమెల రాజు, రీమల చంద్రరావు, కుటుంబసభ్యులు గిరిజన ఉద్యోగసంఘాలు వారు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో అంతా భాగస్వాములు కావాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జికెవీధి మండలం సీలేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో విద్యార్థులు పిచ్చిమొక్కలు చెత్త తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దకే రేషన్

ప్రజాశక్తి - కొయ్యరు : మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ సర్పంచ్ పీటా సింహాచలం వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ అందిస్తున్నామన్నారు. వీఆర్‌ఒ సత్యనారాయణ సిబ్బందితో కలిసి శనివారం 40 మందికి ఇంటి వద్దనే రేషన్ అందించినట్టు తెలిపారు.

ఆక్రమణల తొలగింపుపై అధికారుల తాత్సారం

-ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో రోడ్డు ఆక్రమణల తొలగింపు పై అధికారులు తాత్సార వైఖరి ప్రదర్శిస్తున్నారని, అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ధ్వజమెత్తారు. ఆయన నివాస గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాడేరులో ఆక్రమణల తొలగింపు అధికారులు వాయిదాల పద్ధతిలో చేస్తున్నారని విమర్శించారు. ప్రతి శనివారం మాత్రమే ఆక్రమణల తొలగింపునకు అధికారులు ఆ రోజునే ఎందుకు ఎంచుకున్నారోనని ప్రశ్నించారు. అధికార పార్టీ వారికి అనుకూలంగా ఉండేందుకు ఇలాంటి జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. మెయిన్ రోడ్లపై వాహనాలు అడ్డంగా ఉంటున్నాయని ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ జటిలమవుతోందని, వాహనాలకు పార్కింగ్ స్థలం లేని పరిస్థితి ఉందని తెలిపారు. అధికారులు ఈ పరిస్థితిని మరింత జఠలం చేయకుండా హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి త్వరితగతిన ఆక్రమణల తొలగింపు రోడ్ల విస్తరణ పనులు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ్రమాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల పట్ల సంక్షేమ అధికారులు తీవ్ర చులకన భావంతో వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తలారసింగి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వసతి సౌకర్యం అధ్వానంగా ఉందని, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని మరుగుదొడ్ల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ పాఠశాలలో తాను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల దుస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకున్నామని చెప్పారు పాఠశాలలో 432 మంది విద్యార్థులు శిథిల భవనంలో వసతి సమస్యతో సతమతమవుతున్నారన్నారు.వేసవి సెలవుల్లోనే పాఠశాల భవనాలు మరమ్మతులు చేయాల్సి ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

బెట్టు కాటాలతో సంతల్లో మోసాలు

-100 కేజీలకు 10 కేజీల కోత



బెట్టు కాటా

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని శనివారం జరిగే వారపు సంతల్లో గిరిజన రైతులు కష్టపడి పండించిన పంటలను అమ్మకానికి తీసుకొస్తున్నారు. దళారీలు 'బెట్టు కాటా' పేరుతో తీవ్రంగా మోసం చేస్తున్నారు. ప్రతి 10 కేజీలకు ఒక కేజీ చొప్పున తూకంలో కోత విధిస్తున్నారు. 100 కేజీలకు 10 కేజీల వరకూ తగ్గింపుతో రైతులు నష్టపోతున్నారు. కొండలు, లోయల మధ్యలో ఎంతో కష్టపడి పండించిన పంటలకు సరైన ధరలు లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రవాణా చార్జీలు కూడా అధికంగా ఉండటంతో, తమ కష్టానికి తగినంత లాభం లభించలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, వారపు సంతల్లో బెట్టు కాటా మోసాలను అరికట్టేందుకు అధికారులు దృష్టి సారించాలని, తూకం పరికరాలపై పర్యవేక్షణ పెంచాలని, రైతులకు న్యాయం జరగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎకో సెన్సిటివ్ జోన్ గ్రామసభలు నిలుపుదల చేయాలి



నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సురేష్, తదితరులు



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -చింతూరు : ఎకో సెన్సిటివ్‌జోన్ పేరుతో ఆదివాసీలను గెంటివేసే కుట్రను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. శనివారం లక్కవరంలో గిరిజనసంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైల్డ్‌లైఫ్ నేషనల్ పార్క్‌ను ఆనుకుని పది కిలోమీటర్లు పరిధిలోని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు సమ్మతి తెలియజేస్తూ తీర్మానాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు జారీచేశాయన్నారు. రెవెన్యూ, అటవీ సిబ్బంది గ్రామసభలు నిర్వహిస్తున్నారని ఈ సభలను ఆదివాసీలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ అధినేతలు అంబానీ, అదానిలకు ప్రకృతి సహజ సంపదను దోచిపెట్టేందుకే ఈ తీర్మానాలు చేస్తున్నారన్నారు. తక్షణమే గ్రామసభలను నిలుపుదల చేయాలన్నారు. జూలై 6 వ తేదీన చింతూరు మండల గిరిజన సంఘం మహాసభను లక్కవరంలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు గిరిజన సంఘ రాష్ట్రఅధ్యక్షుడు లోతా రామారావు, ఉపాధ్యక్షులు బొప్పన కిరణ్, జిల్లా నాయకులు పులి సంతోష్ హాజరవుతారని, ఈ మహాసభ జయప్రదం చేసేందుకు మండల కార్యకర్తలు అంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం నాగేష్, నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు పాల్గొన్నారు.

పోడుభూముల జోలికొస్తే సహించేది లేదు

విఆర్‌పురం : రామవరం పంచాయతీ పరిధిలోని కోపల్లి, అడివి వెంకన్నగూడెం, సోములగూడెం గ్రామాల్లో శనివారం గ్రామసభ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ గ్రామాలకు సంబంధించిన భూములు ఫారెస్ట్ అధికారులు పాపికొండల నేషనల్‌పార్క్ పేరుతో ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలో ఉన్న భూములు కావాలని ఫారెస్ట్ అధికారులు కోరారు. ఎంపిపి కారం లక్ష్మి, పీసా కమిటి సభ్యులు మాట్లాడుతూ పోడు భూముల జోలికి వస్తే సహించేది లేదని ఫారెస్ట్ అధికారులను హెచ్చరించారు. అలాగే ఎకో సెన్సిటివ్ జోన్ పేరు చెప్పి ఆదివాసుల భూములు లాక్కోవాలని చూస్తే తిరుగుబాటు చేస్తా మని ఫారెస్ట్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. గ్రామసభలో పాల్గొన్న ఆదివాసీలంతా ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. గ్రామసభలో పీసా కమిటీ సభ్యులు కుంజ నాగిరెడ్డి, కట్టంబజార్, దుర్గారావు, కిరణ్, మాజీ సర్పంచులు,సిపిఎం మండల కమిటి సభ్యులు కారం సుందరయ్య, వడ్లది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పాము అర్జున

ప్రజాశక్తి - గంగవరం : ఆయిల్‌పావ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఆయిల్ కంపెనీ డిజిఎంప్రకాష్ అన్నారు. శనివారం గంగవరం మండలం మొల్లేరులో ఉద్యానవనశాఖ పతంజలి ఫుడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ విస్తరణ మహోత్సవం సమావేశాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పతంజలి కంపెనీ ఉద్యానవనశాఖ రైతులకు అందించే సౌకర్యాలను హార్టికల్చరల్ అధికారి ముత్తయ్య రైతులకు వివరించారు. మాజీ కోఆప్షన్ సభ్యులు టిడిపి మండల కమిటి అధ్యక్షుడు పాము అర్జున మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఈ ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారని ఉద్యానవన శాఖ పతాంజలి కంపెనీ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ సీనియర్ అధికారి శ్రీనివాస ఫీల్డ్‌ఆఫీసర్ కార్తికేయరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ ఉమామహేశ్వరరావు సూపర్‌వైజర్ అప్పారావు మల్లవరం సర్పంచ్ అర్జునరావు, రైతులు ఉద్యానవన అసిస్టెంట్ లలిత, డ్రిప్ ఇరిగేషన్ వెంకటరమణ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి :12 మంది అరెస్ట్

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలోని తంటికొండ పంచాయతీ వట్టిగడ్డ గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. శుక్రవారం రాత్రి పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ 9,400 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సైన్స్ కళాశాల విద్యార్థులకు రూ.లక్ష స్కాలర్‌షిప్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థులకు రూ.లక్ష స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నట్లు మహారాజా విక్రమ్ దేవ్ వర్మ కుటుంబ సభ్యులు విశ్వేశ్వర చంద్ర చూడు దేవ్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన ఏయూ ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్‌ను కార్యాలయంలో కలిసి దీనికి సంబంధించిన చెక్కును అందజేశారు. ప్రతి ఏటా తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూ.లక్ష విరాళంగా అందిస్తామని చెప్పారు. వీటిని సైన్స్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్షిప్ రూపంలో అందించాలని కోరారు. మహారాజా విక్రం దేవ్ వర్మకు విద్యారంగం, ముఖ్యంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అంటే ఎంతో ఇష్టమని సైన్స్ కళాశాల స్థాపించిన సమయంలో ఆయన ప్రతి సంవత్సరం రూ.లక్షను విరాళంగా అందించే వారని గుర్తు చేశారు. అదే విధంగా నేడు తాము కూడా ఏటా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూ.లక్ష విరాళంగా అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విక్రమ్ దేవ్ వర్మ కుటుంబ సభ్యులు విశ్వేశ్వర చంద్ర చూడు దేవ్ భౌతిక శాస్త్ర విభాగం వద్దనున్న విక్రం దేవ్ వర్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.


వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సమస్యలు పరిష్కరించండి

- డిఆర్ఒకు పంచాయతీ కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలతకు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా పెండింగ్ బిల్లులు చెల్లింపు, ముఖ గుర్తింపు యాప్ ను తొలగించడం, అదనపు పనులు వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రోజు ఉదయం 6 గంటలకే గ్రామాల్లో విధులకు హాజరై ఫోటోలను పంచాయతీ శాఖ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలంటూ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా మూకుమ్మడి సెలవు పెట్టి వినతి పత్రం అందించామన్నారు. గ్రామ సచివాలయం లోని పని భారంతో పాటు గ్రామ పంచాయతీల్లో ఉదయం 6 గంటలకు వెళ్లి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించడం వంటి పని భారంతో అధిక ఒత్తిడి అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 22 మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : శ్రీసాయి సుదీప్, కుమారి నిరోషా హీరో హీరోయిన్లుగా పైడి ఫిల్మ్స్ నిర్మాణంలో పైడి మణిశంకర్ నిర్మాతగా 'మనసు' లఘు చిత్రం షూటింగ్ శనివారం పెందుర్తి సమీపంలోని పినగాడి గ్రామంలో ప్రారంభమైంది. రైటర్స్ ఆకాడమి చైర్మన్ రమణమూర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పైడి శంకరరావు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ లఘు చిత్రానికి కథ పైడి శంకరరావు, మాటలు విశ్వనాథ గణపతిరావు, స్క్రీన్ ప్లే కో డైరెక్టర్ బత్తిన సూర్యనారాయణ, ప్రముఖ దర్శకులు రేడ్డం యాదకుమార్ దర్శకత్వ పర్యవేక్షణ, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ ఉదయ్ కుమార్, కెమెరా దేగల శ్రీహరి, ధనుష్, దుర్గ, పుష్యమి వ్యవరిస్తున్నారు. పైడి శంకరరావు, నటరత్న హూష్ కాకి అప్పారావు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కమెడియన్ కోరుకొండ రంగారావు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వేముల భాస్కరాచారి, సీనియర్ జర్నలిస్ట్ నూనెల పైడిరాజు, పని స్వామి, ఎంటి రాజు తదితరులు ఈ చిత్రంలో నటీనటులుగా నటిస్తున్నారు.

రహదారి విస్తరణతో మరింత అభివృద్ధి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-చింతపల్లి: అంతర్ రాష్ట్ర కేంద్రంగా గుర్తింపు పొందిన చింతపల్లి వేగంగా అభివృద్ధి చెందాలంటే ప్రజలు, రాజకీయ నాయకులు సమన్వయంతో సహకరించాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్‌తో కలిసి చింతపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చింతపల్లి ప్రధాన రహదారిని 56 అడుగుల మేర విస్తరించాల్సిన అవసరం ఉందని, రహదారి మధ్య నుంచి రెండు వైపులా 25 అడుగుల చొప్పున స్థలం కేటాయించాలన్నారు. ఇరువైపులా మరో ఐదు అడుగుల చొప్పున మురుగు కాలువల ఏర్పాటుకు వీలుగా భూసమీకరణ చేపట్టాల్సిందిగా సూచించారు. రహదారి విస్తరణతో భవిష్యత్తులో చింతపల్లి పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందడమే కాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా అవకాశం కలుగుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని, గతంలో కొనుగోలు చేసిన భూముల రిజిస్ట్రేషన్లకు అవసరమైతే సివిల్ కోర్టుల ద్వారా పరిష్కారం పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వ భూములు, పోరంబోకు భూముల్లో ప్రైవేటు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ భూములు అక్రమాలకు గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ప్రధాన రహదారి విస్తరణలో దుకాణాలు కోల్పోయే గిరిజన పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వం సమన్వయంతో అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖరరావు, మండల సర్వేయర్ సుభాకర్, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, ఆర్ఎస్ఆర్ఐ బి.బాలరాజు దొర, ఆర్ఐ ఎం.కృష్ణమూర్తి, వీఆర్వో పండన్న, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాలలో పూర్వ విద్యార్థుల సంఘాలు

ఎయు ఉపకులపతి జిపి.రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : విదేశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఏయు ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ చెప్పారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్ లోని ఏయు కన్వెన్షన్ సెంటర్లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్), ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఎగ్జిట్ ఎంగేజ్‌మెంట్ ఈవినింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎయుతో విదేశీ విద్యార్థుల ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకొచ్చిందని చెప్పారు. సంయుక్తంగా కలిసి పనిచేయడం, ఆలోచనలు పంచుకోవడానికి ఇది మార్గం చూపిందని చెప్పారు. విదేశీ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఐసిసిఆర్ అందిస్తున్న సహకారంతో ఇది సాకారం అయిందని తెలిపారు. విదేశీ విద్యార్థులంతా భారత్‌లో అంతర్భాగంగా మారిపోయారని చెప్పారు. ఎయు పూర్వ విద్యార్థులుగా మీరంతా విదేశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంచేలా పనిచేయాలని సూచించారు.

ఐసిసిఆర్ స్కాలర్‌షిప్ విభాగం డైరెక్టర్ సంజీవ్ వేది మాట్లాడుతూ, ఎయులో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని తిరిగి వెళుతున్న విదేశీ విద్యార్థులు తమతో పాటు భారతీయతను తీసుకు వెళుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం విభిన్న దేశాలతో భారత్‌కు ఉన్న స్నేహానికి మరింత విలువను జోడిస్తుందని చెప్పారు. ఐసిసిఆర్ అందించే సేవలు మీ దేశాలలో విద్యార్థులకు వివరించి మరింత మందికి ఉపయోగంగా నిలవాలని సూచించారు. ఐసిసిఆర్ నిర్వహించే కార్యక్రమాలను వివరిస్తూ.. వీటిలో ప్రధానమైనది విదేశీ విద్యార్థులకు విద్యకు అవసరమైన స్కాలర్షిప్‌ను అందించడమేనని పేర్కొన్నారు. ఒక ప్రత్యేకమైన వైవిధ్యత కలిగిన కార్యక్రమంగా స్కాలర్‌షిప్ ప్రోగ్రాం నిలుస్తుందని తెలిపారు.

ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 59 దేశాల నుంచి 1100 మందికిపైగా విదేశీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేసుకోవడం పట్ల విదేశీ విద్యార్థులను అభినందించారు. ఏయూలో నాణ్యమైన విద్యను వీరికి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసిసిఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం అసోసియేట్ డీన్ ఆచార్య ఎన్ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎయుతో తమకున్న అనుబంధాన్ని, విశాఖ నగరం, తెలుగు ప్రజల ప్రేమాభిమానాలను గుర్తు చేసుకుంటూ వేదికపై తమ అనుభూతులను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఆలుమ్ని కార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో భాగంగా విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎంవిఆర్.రాజు, జి.గిరిజ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎలను ఆదుకోండి

ప్రజాశక్తి -ఆనందపురం : తరతరాలుగా రెవెన్యూ వ్యవస్థలో గ్రామ నౌకర్లు, గ్రామ సహాయకులు, ప్రస్తుతం విఆర్ఎలుగా సేవలందిస్తున్న దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విఆర్ఎల సంఘం మండల కార్యదర్శి ఉప్పాడ చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ, అనేక మంది విఆర్ఎలు చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తూ, అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు.

నేరాలు ఘోరాలు

కొమ్మంగి వంతెన వద్ద ఆటో బోల్తా

- 10 మందికి గాయాలు

ప్రజాశక్తి- చింతపల్లి: మండలంలోని కొమ్మంగి బోడ కొండమ్మ తల్లి ఆలయం సమీపంలోని వంతెన వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కుదుపు సింగి గ్రామానికి చెందిన ఆటోలో కొమ్మంగి గ్రామస్తులను చింతపల్లి తరలిస్తున్న సమయంలో ఘాటీ వంపులో బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి వంతెన వద్ద బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కుడుముల జానకమ్మ, కూడా దేవకుమారి, పాంగి చంద్రమ్మ, పాంగి పెద్దమ్మలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఆరుగురికి స్వల్ప గాయాలు అయినట్టు గ్రామస్థులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కొమ్మంగి గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బాధితులను మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గొలుగొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు గొలుగొండ ఎస్సై పి.రామారావు తెలిపారు. కాకినాడ జిల్లా పెద్దాపురంకు చెందిన షేక్ జాన్‌భాషా నర్సీపట్నం అయ్యన్నకాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం నర్సీపట్నం నుంచి కృష్ణదేవిపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పప్పుశెట్టిపాలెం శివారులో వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- గొలుగొండ: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. తమిళనాడు మధురైకు చెందిన ఓ.విఘ్నేష్ గంజాయి కేసులో నిందితుడిగా ఉండి నాలుగేళ్లుగా పరారీలో ఉన్నాడన్నారు. శనివారం ఆ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని టిడిపి పాడేరు ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచించారు. పాడేరు పట్టణంలోని విఆర్ ఫంక్షన్ హాలులో శనివారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై 2వ తేదీ నుండి పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు.ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తీసుకెళ్లేలా ప్రచారం చేయాలని సూచించారు. ఈ అంశాలపై పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఐదు మండలాల నాయకులు, టిడిపి మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, ఎంపిపిలు, జడ్ పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలపై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కంద్రం పంచాయతీలో స్థానిక సర్పంచ్ కె.హరి ఆధ్వర్యంలో శనివారం జన్ జాతీయ గౌరవ వర్ష్ వేడుక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం జన్మన్ గృహ నిర్మాణ పథకం జలజీవన్ మిషన్, ఈ శ్రమ్ ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కార్యక్రమాలపై గిరిజనులకు అధికారులు అవగాహన పరిచారు. సీఎం జన్మన్ గృహ నిర్మాణం, జలజీవన్ మిషన్ వంటి పథకాలతో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ పథకాలను మండంలోని ఆయా గ్రామాల్లోని గిరిజనులు ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని సర్పంచ్ హరి కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, వైద్య సిబ్బంది, సచివాలయ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బదిలీ అయిన అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

బదిలీ అధికారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గంగవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్‌రావు, కమ్యూనిటీ సర్వేయర్ పి.గిరిబాబును తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. వారిరువురికి బదిలీ అయిన సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. డిప్యూటి తహశీల్దార్ సర్వేయర్ సేవలను తహశీల్దార్ శ్రీనివాసరావు కొనియాడారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వీరప్పదొర, మండల వీఆర్ఒలు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గృహనిర్మాణ సామగ్రి అందిస్తున్న జమాల్‌ఖాన్

గృహ నిర్మాణానికి జెకెసి ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి - చింతూరు: చింతూరు మండలం ముకునూరుకు చెందిన బెల్లల రమణమ్మ కుటుంబానికి జెకె సిటి ట్రస్ట్ ద్వారా శనివారం ఇంటి నిర్మాణ సామగ్రి 10 సిమెంట్ రేకులు, 10 ఇనుపపైపులు అందజేశారు. బెల్లలరమణమ్మ కుటుంబంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో జమాల్ ఖాన్‌ను ఆశ్రయించి ఇంటి నిర్మాణానికి సహాయం చేయవలసిందిగా కోరారు. అందుకు ఆయన స్పందించి సిమెంటు రేకులు, ఇనుప పైపులను బెల్లల రమణమ్మ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాదర్. వహీద్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యాధికారి సౌమ్యను సత్కరిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

పిహెచ్‌సి వైద్యాధికారి సౌమ్యకు సన్మానం

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌమ్యకు బాపట్ల జిల్లా పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయింది. ఈ మేరకు స్థానిక ఆసుపత్రి సిబ్బంది శనివారం ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. డాక్టర్ సౌమ్యకు శాలువా కప్పి సన్మానించారు. డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ సీలేరు పిహెచ్‌సిలో పనిచేసిన రెండున్నర సంవత్సరాలు ఇక్కడి సిబ్బంది చక్కగా సహకరించారన్నారు. వైద్యాధికారి ఖాదర్‌మస్తాన్‌వల్లి ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు త్రినాథ, బాలమణి, స్టాఫ్‌నర్సులు దేవి, హైమ, మాధురి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


అడుగుకో గొయ్యి .. ప్రాణాలు హరీ..!

గొంటివానిపాలెం - ఏలేశ్వరం రహదారి దుస్థితి
వర్షం కురిస్తే చెరువును తలపిస్తున్న వైనం..
మరమ్మతులు చేయకపోతే ఆందోళన చేస్తాం
ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: అల్లూరి జిల్లా తూర్పుగోదావరి కాకినాడ జిల్లాలను కలిపే ఆర్అండ్‌బి సుమారు 13 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా తయారైందని వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ నుంచి ఏలేశ్వరం కాకినాడ రాజమండ్రి వంటి మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు అనుసంధానదంగా ఉన్న ఈ రహదారిపై నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో సుమారు 22 కోట్ల రూపాయలు నిధులు మంజూరైనప్పటికీ, అప్పటి ప్రభుత్వం సక్రమంగా స్పందించకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు నిలిపేశారు. జడ్డంగి అన్నవరం నుండి రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, గొంటివానిపాలెం మధ్య రహదారి పూర్తిగా శిథిలమైపోయింది. ఇటీవల రహదారి కొంతమేర బాగుచేసినప్పటికీ భారీవాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి వర్షం కురిస్తే గోతులు నిండిపోయి ఎక్కడ గొయ్యి ఉందో కూడా తెలియని పరిస్థితి ఉంది. చాలామంది వాహనచోదకులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల నుండి ఎక్కువమంది ఏలేశ్వరం వెళుతుంటారు. తక్షణం రహదారి బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.


గోతులమయమైన జె.అన్నవరం, ఏలేశ్వరం రహదారి

రహదారి నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన



జడ్డంగి అన్నవరం నుండి ఏలేశ్వరం వెళ్లే ప్రధాన బీటీ రహదారి అధ్వానంగా తయారైంది. తక్షణం ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టకపోతే ఆందోళన చేపడతాం.

- లోతా రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు

రేకుల షెడ్లలో తరగతులు.. వరండాలో వంటలు

మధ్యలో నిలిచిపోయిన టాయిలెట్ పనులు
ఇదీ సీలేరు హైస్కూల్ దుస్థితి


మధ్యలో నిలిచిపోయిన టాయిలెట్ పనులు


వరండాలో వంట చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం, సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతిగదులు, ఉపాధ్యాయులకు రెస్ట్‌రూం, విద్యార్థులకు టాయిలెట్స్ మధ్యాహ్నభోజన పథకానికి వంటషెడ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల నిర్మించి దాదాపు 60 సంవత్సరాలు దాటుతోంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ రేకులషెడ్లలోనే తరగతి గదులు, ఆఫీస్‌రూం, డిజిటల్ క్లాస్‌రూం నిర్వహిస్తున్నారు. కాలక్రమేణా ఇవి శిథిలావస్థకు చేరుకుని వర్షాకాలంలో కారిపోతుండడంతో తరగతి గదులు నిర్వహించలేని దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు నిధులు ఒక కోటి ఐదు లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో షెడ్లపై పైకప్పులు మార్చి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. పాఠశాల పక్కనే ఉన్న స్థలంలో పక్క భవనాలను నిర్మించడానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనులు అప్పగించారు. పిల్లర్ల వరకూ నిర్మాణాలు జరిగాయి. కొంతమేరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. మరికొన్ని బిల్లులు రావాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. థర్డ్‌పార్టీ కింద ఆసక్తిగల కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఒకే గదిలో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. హిందీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది. పాఠశాల వరండాలో ఆరుబయటే వంటలు చేయాల్సి వస్తోంది. తాగునీటికి ఓవర్‌హెడ్ ట్యాంకు లేదు. గతంలో తాత్కాలికంగా 1000 లీటర్ల నీటిని నిలువచేసే సింథటిక్ ట్యాంకు ఏర్పాటు చేశారు. కోతులు వీరంగం చేయడంతో మరమ్మతులకు గురైంది. దీంతో మధ్యాహ వంటలు వండే సమయంలో మోటారు ఆన్ చేసి పైపుద్వారా నీటిని డ్రమ్ముల్లో పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ విద్యాశాఖాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

'ఇగ్నో' పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో), విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని మూడు పరీక్ష కేంద్రాలను ఇగ్నో ప్రాంతీయ సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శనివారం సందర్శించారు.

గాజువాకలోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించి పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని సమీక్షించి అక్కడ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ఇగ్నో సమన్వయకర్త పరీక్షల ముఖ్య పర్యవేక్షకులు, డా.ఎస్.వి.కృష్ణను అభినందించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే శిరీషాదేవి, విజయభాస్కర్

ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గంలో పలు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శనివారం తెలిపారు. నియోజకవర్గంలో రేషన్‌కార్డులు, పింఛన్లు చాలామందికి భూమి ఎక్కువ ఉందన్న కారణం అలాగే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతం రీత్యా కొన్ని గ్రామాల్లో అటవీశాఖ అనుమతులు లేక చాలా రోడ్ల నిర్మాణపనులు నిలిచిపోయాయన్నారు. అటవీశాఖ టూరిజం పేరుతో సందర్శకుల నుండి అధికమొత్తంలో వసూళ్లను ఆపి, నామమాత్రపు రుసుముతో కొనసాగించాలని కోరారు. పందిరిమామిడి నుండి కోట మధ్యలో బిటి రహదారి వెయ్యలేదని దానికి రెవెన్యూఅధికారులు సర్వే నంబర్ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. రాజవొమ్మంగి మండలంలోని కిర్రాబు ఆనకట్ట నిర్మాణం ఆవశ్యకతను వివరించామన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. చింతూరు డివిజన్‌లో ముంపు గ్రామాల ప్రజలకు ముంపు రాకముందే సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ చేపట్టాలని కోరామని తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆమె వెంట తెలుగు యువత అధ్యక్షులు విజయ్‌భాస్కర్ ఉన్నారు.

ఎయులో ఘనంగా రాజా విక్రమ్‌దేవ్ జయంతి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భూములు దానం చేసిన మహారాజా విక్రమ్‌దేవ్‌వర్మ బహదూర్ జయంతి వేడుకలు శనివారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. మహాసంస్థాన్ యువరాజు విశ్వేశ్వర చంద్రచూడ్‌దేవ్‌రాజా ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన జయపూర్ విక్రమ్‌దేవ్‌కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి లక్ష రూపాయల వార్షిక స్కాలర్‌షిప్‌ను ప్రకటించారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని చెక్కు రూపేణ ఎయు వైస్ చాన్సలర్ ఆచార్య జిపి రాజశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మహారాజా విక్రందేవ్‌వర్మ ప్రతిఏటా లక్ష రూపాయలు విరాళం ఇచ్చేవారని, దాన్ని కొనసాగింపుగా ఈ ఏడాది నుంచి ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు సైన్స్‌అండ్‌టెక్నాలజీ కాలేజీకి విరాళం ఇస్తామని చెప్పారు. దాన్ని ఉత్తమ విద్యార్థులకు లేదా ఫెలోషిప్‌కి వినియోగిస్తారని తెలిపారు. విద్యను ప్రజలకు అందించేందుకు, అభివద్ధి కావడానికి గొప్ప సాధనంగా భావించిన దివంగత మహారాజు ఒక దార్శనికుడు అని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటి డైరక్టర్ ఆచార్య ఎం.కిషోర్‌బాబు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ రాజు, జైపూర్ సంస్థానానికి చెందిన కిషన్‌రాథోడ్, న్యాయవాది వజ్జిపర్తి శ్రీనివాస్, బిజెపి నాయకులు మూల వెంకటరావు, క్రాంతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత వెంకట్‌రెడ్డి, సైన్స్ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్తంగా ఎస్సి కార్పొరేషన్, ఆధ్వర్యంలో గాజువాక పెదగంట్యాడ నాక్ శిక్షణా కేంద్రంలో ఫ్రంట్ ఆఫీస్, అసోసియేట్ కోర్స్‌లో ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన (పిఎంఎజెఎవై) పథకం క్రింద షెడ్యూల్డ్ కులానికి చెందిన యువతకు స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి 18 నుండి 40 సంవత్సరాల వయోపరిమితి గల ఎస్‌సి అభ్యర్థులు అర్హులన్నారు. సీట్లు పరిమితంగా ఉన్నాయని, శిక్షణ నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నభోజనం, స్టేషనరీ ఉచితంగా అందజేస్తామని శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7981022453లేదా 9063269849 నంబర్లలో సంప్రదించాలని కోరారు.